TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

బుధవారం 15, ఏప్రిల్ 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :208 | పేజీలు :4 | వెల. 3/-



## ఘనంగా అంబేద్కర్ జయంతి

తెలంగాణవ్యాప్తంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు జననీరాజనాల మధ్య అంబరాన్నంటాయి. పల్లె నుండి పట్నం దాకా 'జై భీమ్' నినాదాలతో రాష్ట్రం ప్రతిధ్వనించింది. సామాజిక సమానత్వం కోసం బాబాసాహెబ్ చేసిన పోరాటాన్ని స్మరించుకుంటూ, కులమతాలకు అతీతంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు మరియు మేధావులు ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలను నిర్వహించారు.

— వివరాలు లోపలి పేజీల్లో

- అంబరాన్నంటిన వేడుకలు
- పల్లె నుండి పట్నం దాకా ఘనంగా బాబాసాహెబ్ జయంతి ఉత్సవాలు
- మార్మోగిన జై భీమ్ నినాదం
- వాడవాడలా అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు , అభిషేకాలు
- ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో భక్తిశ్రద్ధలతో వేడుకలు

# డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం..




- అఖిలపక్షం ఏర్పాటు చేయాలి : ప్రధానికి సీఎం రేవంత్ లేఖ
- జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం
- మహిళా రిజర్వేషన్లపై గందరగోళం వద్దు.. వెంటనే అమలు చేయండి
- రేవంత్ రెడ్డి డిమాండ్

2

దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేయగల నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమరశంఖం పూరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన లోక్‌సభ సీట్ల పెంపు ప్రక్రియ దేశ ఫెడరల్ స్ఫూర్తికే గొడ్డలిపెట్టుగా మారుతుందని, ముఖ్యంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన సుదీర్ఘమైన లేఖలో.. జనాభా నియంత్రణను పాటించి జాతీయ ప్రయోజనాలకు కట్టుబడినందుకు దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం 'రాజకీయ శిక్ష' వేయాలని చూడటం అత్యంత దురదృష్టకరమని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. కేవలం తలల గణన ప్రాతిపదికన సీట్లను పెంచితే, ప్రజాస్వామ్య సమానత్వం దెబ్బతిని ఉత్తరాది ఆధిపత్యం పెరిగే ప్రమాదం ఉందని, తక్షణమే ఈ అంశంపై జాతీయ స్థాయిలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లు మరియు డీలిమిటేషన్ అంశాలను ఒకదానితో ఒకటి ముడిపెట్టి కేంద్రం ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని ముఖ్యమంత్రి విమర్శించారు. మహిళలకు రాజకీయ సాధికారత కల్పించాలనే చిత్తశుద్ధి ఉంటే, సీట్ల సంఖ్య పెంచే వరకు వేచి చూడకుండా ప్రస్తుతం ఉన్న 543 స్థానాల్లోనే వెంటనే 33 శాతం కోటాను అమలు చేయాలని సూచించారు. దేశ ప్రగతికి ఇంజన్లుగా నిలుస్తున్న దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగానే కాకుండా, రాజకీయంగా కూడా నిర్మాణాత్మకంగా నష్టపోయే పరిస్థితి రాకుండా 'హైబ్రిడ్ మోడల్' పద్ధతిలో అభివృద్ధి ప్రమాణాల ఆధారంగా సీట్లను కేటాయించాలని ఆయన ప్రధానికి రాసిన లేఖలో స్పష్టమైన ప్రతిపాదనలు చేశారు.

— హైదరాబాద్, ప్రభాత గమనం



ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం..

- అఖిలపక్షం ఏర్పాటు చేయాలి : ప్రధానికి సీఎం రేవంత్ లేఖ
- జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం
- మహిళా రిజర్వేషన్లపై గందరగోళం వద్దు.. వెంటనే అమలు చేయండి
- రేవంత్ రెడ్డి డిమాండ్




హైదరాబాద్, ఏప్రిల్ 14 (ప్రభాత గమనం): డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకు లేఖ రాశారు. దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ప్రభావం చూపే ఈ కీలక అంశంపై అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.
డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, లోక్‌సభ సీట్ల పెంపు వంటి మూడు అంశాలను ఒకదానితో ఒకటి ముడిపెట్టడం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడుతోందని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు అంశాలు స్వతంత్ర విషయాలని, వాటిని విడివిడిగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### మహిళా రిజర్వేషన్ కు పూర్తి మద్దతు

మహిళల రాజకీయ సాధికారతకు తమ ప్రభుత్వం, పార్టీ కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను యథాతథంగా వెంటనే అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర అసెంబ్లీల్లో కూడా ఇదే విధానం అమలు చేయాలని కోరారు. మహిళల భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తుందని పేర్కొన్నారు.

### సీట్ల పెంపుపై తీవ్ర ఆందోళన

లోక్‌సభ సీట్లను 850కు పెంచే ప్రతిపాదనపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. గతంలో డీలిమిటేషన్ ప్రక్రియలో సీట్ల సంఖ్య పెంచకుండా కేవలం నియోజక వర్గాల సరిహద్దులను మార్చిన విషయాన్ని గుర్తుచేశారు. అదే విధానాన్ని ఇప్పుడు కూడా అనుసరించవచ్చని సూచించారు.

### దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం

జనాభా నియంత్రణ, ఆరోగ్యం, మానవ అభివృద్ధి రంగాల్లో ముందున్న తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలు ఈ విధానంతో నిర్మాణాత్మకంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ రాష్ట్రాలు జాతీయ విధానాలకు అనుగుణంగా జనాభా నియంత్రణలో విజయవంతంగా ముందుకు సాగినప్పటికీ, ఇప్పుడు అదే కారణంగా రాజకీయంగా బలహీనపడే పరిస్థితి రావడం అన్యాయమని తెలిపారు.

### నిధుల పంపిణీపై విమర్శలు

కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు నిధుల పంపిణీలో ఇప్పటికే వివక్ష ఉందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా బిహార్, ఉత్తర్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలకు అధిక నిధులు వెళ్తుండగా, తెలంగాణకు తక్కువ నిధులు వస్తున్నాయని తెలిపారు. ఇది దక్షిణాది–ఉత్తరాది అసమానతలకు దారితీస్తోందని విమర్శించారు. సీట్ల పెంపు కూడా ఇదే ధోరణిని మరింత పెంచి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యాన్ని తగ్గించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదన

సీట్ల కేటాయింపులో హైబ్రిడ్ విధానం అమలు చేయాలని సీఎం ప్రతిపాదించారు. కొత్తగా పెంచే సీట్లలో కొంత భాగాన్ని జనాభా ప్రాతిపదికన, మిగిలిన భాగాన్ని రాష్ట్రాల ఆర్థిక సహకారం (GSDP), అభివృద్ధి సూచికల ఆధారంగా కేటాయించాలని సూచించారు. ఈ విధానం ద్వారా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు నష్టపోకుండా ఉండటంతో పాటు, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యానికి సమతుల్యత ఏర్పడుతుందని తెలిపారు.

### అఖిలపక్ష సమావేశం అవసరం

ఈ కీలక అంశంపై దేశవ్యాప్తంగా చర్చలు జరపడం అవసరమని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు కలిసి చర్చించి ఒక ఏకాభిప్రాయానికి రావాలని కోరారు. భారతదేశ బలం భిన్నత్వంలో ఏకత్వమని, ఇలాంటి నిర్ణయాలు దేశ ఐక్యతను బలోపేతం చేసేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ అందరికీ న్యాయం చేసే విధంగా తగిన పరిష్కారం కనుగొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కులవివక్ష లేని సమాజ నిర్మాణమే అంబేద్కర్ కు ఇచ్చే నిజమైన నివాళి

- సర్పంచ్ తూర్పాటి శంకరయ్య
- ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు

తొర్రూర్, ప్రభాత గమనం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, కుల వివక్ష లేని సమాజ నిర్మాణమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని మేచరాజుపల్లి గ్రామ సర్పంచ్ తూర్పాటి శంకరయ్య అన్నారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తూర్పాటి శంకరయ్య, ఉప సర్పంచ్ తాళ్లపెల్లి వెంకన్న గౌడ్ ఇతర నాయకులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వారు కాదని, ఆయన ఈ దేశపు గర్వించదగ్గ గొప్ప ఆస్తి అని కొనియాడారు. ఆయన రాసిన రాజ్యాంగం వల్లనే నేడు పౌరులందరికీ సమాన హక్కులు లభించాయని గుర్తు చేశారు. సమాజంలో అస్పృశ్యతను రూపుమాపి, అందరూ సమానత్వంతో మెలిగినప్పుడే బాబాసాహెబ్ ఆశయాలు సిద్ధించి ఆయకు తగిన గౌరవం దక్కుతుందన్నారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవడానికి ప్రజలంతా కులమతాలకు




అతీతంగా, సోదరభావంతో కలిసికట్టుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ముంజంపల్లి వీరయ్య, వెంకన్న, కోటగిరి అనిల్, నక్క హరీష్, సంగె యాకన్న, అంగన్ వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, కారోబార్ దుబర్ల సాయిలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మేడే కార్యక్రమాలను విజయవంతం చేయాలి

### ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న

కేసముద్రం, ఏప్రిల్ 14 (ప్రభాత గమనం): గ్రామ గ్రామాన మేడే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని కంచ వెంకన్న పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏఐసిటియు ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంచ వెంకన్న మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మార్చుతూ, పని గంటలను పెంచుతున్నాయని విమర్శించారు. దీని వల్ల కార్మికులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, పని గంటల తగ్గింపు వంటి ప్రయోజనాలు కోల్పోతున్నారని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు, సమగ్ర చట్టాలు తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం "సమాన పనికి సమాన వేతనం" అమలు చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అది అమలు కావడం లేదని అన్నారు. కార్యక్రమంలో వేల్పుల వెంకన్న, బానోత్ సురేష్, అందే భాస్కర్, రాస ఉప్పలయ్య, కొత్త కరుణాకర్, బయ్య కుమార్, కస్తూరి వెంకన్న, మంద నరేష్, ఎస్కే మీరా సాబ్ తదితరులు పాల్గొన్నారు.

# గార్ల మండలంలో కాంట్రాక్టర్ల 'కక్కుర్తి'

- జీపీ సిబ్బందితో రోడ్డు క్యూరింగ్ పనులు!
- గ్రామాల్లో పడకేస్తున్న పారిశుధ్యం



గార్ల, ఏప్రిల్ 14, ప్రభాతగమనం: గార్ల మండలంలో కాంట్రాక్టర్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రజా ధనం వృథా కావడమే కాకుండా, నిబంధనలను పక్కన పెట్టి ప్రభుత్వ యంత్రాంగాన్ని స్వలాభం కోసం వినియోగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలో నిర్మిస్తున్న రోడ్లకు క్యూరింగ్ (నీళ్లు పట్టే ప్రక్రియ) పనులు చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌దే అయినప్పటికీ, తన సొంత కూలీలను ఉపయోగించకుండా గ్రామ పంచాయతీ (GP) సిబ్బందినే వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం రోడ్డు పనులకు సంబంధించిన అన్ని ఖర్చులు, కూలీలు, నీటి సౌకర్యం కాంట్రాక్టర్ భరించాల్సి ఉంటుంది. ఇందుకోసం టెండర్లలో ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయిస్తుంది. అయినప్పటికీ, ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నంలో పంచాయతీ సిబ్బందిని పనుల్లోకి దించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విధంగా ప్రభుత్వ సిబ్బందిని ఉపయోగించడం పరోక్షంగా అవినీతికి దారితీస్తోందని ప్రజలు అంటున్నారు. మరోవైపు, పారిశుద్ధ్య పనులు, ఇతర అత్యవసర సేవలకు ఉండాల్సిన జీపీ సిబ్బందిని రోడ్డు పనులకు మళ్లించడం వల్ల గ్రామాల్లో రోజువారీ సేవలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది. "మా గ్రామానికి సంబంధించిన పనులు చూసుకోవాల్సిన సిబ్బందిని కాంట్రాక్టర్ తన పనులకు ఎలా వాడుకుంటారు?" అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



నెక్కొండలో అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళి...




గార్లలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో..



క్యాంప్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో..

# మహనీయుడు అంబేద్కర్

- భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు
- నివాళులర్పించిన ప్రముఖులు



వరంగల్ కమిషనరేట్ లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు

ప్రభాత గమనం, వరంగల్ జిల్లా క్రైమ్ బ్యూరో: భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ప్రతిభావంతమైన న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నాయకుడే కాకుండా గొప్ప సంఘ సంస్కర్తగా సేవలందించారని తెలిపారు. సమాజంలో ఉన్న అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తిగా కొనియాడారు. నేటి యువత అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలంటే అంబేద్కర్ ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, ఆర్ఐ రత్నం, ఆర్ఎస్ఐ ఫిరోజ్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో..

ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనరేట్ పరిపాలన విభాగం కార్యాలయ భవన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి ముఖ్యఅతిథిగా పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ లు సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు డేవిడ్ రాజ్, జాన్ నరసింహులు, అంతయ్య, సురేంద్ర, ఆర్ఐలు, ఇన్స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

**నివాళులర్పించిన ఎస్ఐ బి.సాయికుమార్**

గార్ల, ఏప్రిల్ 14 (ప్రభాత గమనం): రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలు నేటి సమాజానికి దిక్సూచి అని గార్ల సబ్ ఇన్స్పెక్టర్ బి. సాయికుమార్ పేర్కొన్నారు. మంగళవారం గార్ల మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక న్యాయం అందించడంలోనూ అంబేద్కర్ బోధించిన విలువలను తాము నిరంతరం పాటిస్తామని తెలిపారు.

## నెక్కొండలో..

నెక్కొండ, ప్రభాత గమనం :
భారత రాజ్యాంగ నిర్మాత, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు నెక్కొండ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ఉన్న విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ ట్రైబ్యునల్ మాజీ సభ్యుడు గటిక అజయ్ కుమార్, మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివకుమార్, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు జాటోత్ రమేష్ నాయక్, మాజీ జిల్లా పరిషత్ సభ్యురాలు సరోజ హరికిషన్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గుంటుక సోమయ్య, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ధోనికేనా సారంగపాణి, కారింగుల సురేష్, సర్పంచ్ కట్కూరి నరేందర్ రెడ్డి, వాగ్య నాయక్, స్వరూప రవి, దేవానబోయిన వీరభద్రం, ఈదునూరి వెంకన్న, బక్కి కుమారస్వామి, ఈదునూరి దిలీప్, రేగుల అశోక్, ఊళ్లేరావు మోహన్, చెరుకు వెంకటాద్రి, అక్కినపెల్లి నవీన్, బొల్లపల్లి శ్రవణ్, శ్రీనిస్, మునిగే అశోక్, ఆకులపెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

**క్యాంప్ తండాలో ఘనంగా వేడుకలు**

కేసముద్రం, ఏప్రిల్ 14 (ప్రభాత గమనం): కేసముద్రం మండలం క్యాంప్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ ధరావత్ కైక అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డాక్టర్ అంబేద్కర్ ఆశయాలు మానత్వం, సామాజిక న్యాయం నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన రచించిన భారత రాజ్యాంగం మన హక్కులు, గౌరవాన్ని కాపాడే శక్తివంతమైన పునాదిగా నిలుస్తోందన్నారు. “అంబేద్కర్ ఆశయాలే మాకు దిక్సూచి, ఆయన చూపిన బాటలోనే మా ప్రయాణం” అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నారాయణపురం మాజీ ఎంపీటీసీ ధరావత్ రవినాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గార్ల మండలంలో..

గార్ల, ఏప్రిల్ 14 (ప్రభాత గమనం):
భారత రాజ్యాంగ నిర్మాత, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను గార్ల మండల కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సీపీఎం, కేవీపీఎస్, సీఐటీయూ, ఐద్వా వంటి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బాబాసాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. కుల, మతాలకు అతీతంగా సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేటి యువత అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, వివక్షలేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో వంగూరి వెంకటేశ్వర్లు, అంబటి వీరస్వామి, మల్లెల నాగమణి, చింత ఎల్లయ్య, చింత మౌనిక, జి. వీరభద్రం పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గార్ల ఎస్సై బి.సాయికుమార్

బుధవారం
15.04.2026
www.prabhatagamanam.com

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, అంబేద్కర్ వాదులు
- యువత అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి : ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్
- భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని : కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్, ఏప్రిల్ 14 (ప్రభాత గమనం): భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మహబూబాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. పట్టణం లోని కోర్ట్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం"లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం, ఇతరులను గౌరవించడం, ప్రమాదాలను నివారించడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయబడింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ, యువత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శమని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా ఏర్పడిన యూపీఎస్సీ వంటి సంస్థలు దేశ సేవకు మార్గదర్శకాలని తెలిపారు. మహిళలు సహా అన్ని వర్గాలకు ఓటు హక్కు కల్పించడం అంబేద్కర్ గొప్ప ఆలోచన అని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్ష నిర్మూలనకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం అంబేద్కర్ గీతాలతో ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, మహిళా ఉద్యోగులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే ప్రథమ లక్ష్యం

### రోడ్డు భద్రతా ప్రతిజ్ఞలో జిల్లా ఎస్పీ శబరీష్

వరంగల్ క్రైం బ్యూరో, ప్రభాత గమనం: మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ లక్ష్యంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలీవ్" కార్యక్రమం రెండో రోజు గూడూరు మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ డా. శబరీష్ హాజరై గూడూరు అంబేద్కర్ సెంటర్‌లోని డా. బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుందని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా లేకపోయినా నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఎస్పీ తిరుపతిరావు, డిఎస్పీ (అడ్మిన్) గంద్రతి మోహన్, గూడూరు సీఐ విజయ్ కుమార్, ఎస్ఐ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.





## మున్నేరు - పాలేరు లింక్ కెనాల్ తో రైతాంగానికి అన్యాయం

- రైతులకు జరిగే నష్టాన్ని నివారించాలి
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కు గార్ల మండల రైతుల వినతి

గార్ల, ఏప్రిల్ 14, ప్రభాతగమనం: ప్రభుత్వం ప్రతిపాదించిన జీవో నెంబర్ 98ను తక్షణమే రద్దు చేయాలని, మున్నేరు – పాలేరు లింక్ కెనాల్ వల్ల తమకు జరుగుతున్న తీవ్ర నష్టాన్ని నివారించాలని కోరుతూ గార్ల మండల రైతులు మంగళవారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. లింక్ కెనాల్ నిర్మాణం వల్ల తమ సాగు భూములు కోల్పోవడమే కాకుండా, జీవనోపాధి దెబ్బతింటుందని రైతులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన సత్యవతి రాథోడ్, వెంటనే భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)తో ఫోన్ ద్వారా మాట్లాడారు. గార్ల మండల రైతుల ఇబ్బందులు, లింక్ కెనాల్ వల్ల కలిగే సాంకేతిక మరియు ఆర్థిక నష్టాలను ఆయనకు వివరించారు. రైతుల గోడును విన్న కేటీఆర్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ నెల చివరిలో స్వయంగా గార్ల మండలానికి వచ్చి రైతులను కలుస్తానని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి, రైతులకు అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. తమ సమస్యపై తక్షణమే స్పందించిన సత్యవతి రాథోడ్‌కు, అలాగే రైతులకు అండగా ఉంటామని తెలిపిన కేటీఆర్‌కు గార్ల మండల రైతాంగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు మూడు హరి, మూడు మోజీ, బాదావత్ చంటి, మూడు సురేష్, బిక్కు తదితరులు పాల్గొన్నారు



## నెక్కొండ మార్కెట్ కు మూడు రోజులు సెలవు

- యార్డులో నిండిపోయిన మొక్కజొన్నల నిల్వలు
- స్థలాభావం వల్ల అధికారుల నిర్ణయం
- శుక్రవారం నుంచి మళ్లీ కొనుగోళ్లు ప్రారంభం
- సహకరించాలని రైతులకు సీఈఓ సురేష్ విజ్ఞప్తి

నెక్కొండ ఏప్రిల్ 14(ప్రభాత గమనం): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్నల రాక విపరీతంగా పెరగడంతో స్థలాభావం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైతులు ఆరబెట్టుకోవడానికి, లారీలు లోపలికి రావడానికి ఏమాత్రం ఖాళీ లేకపోవడంతో అధికారులు మార్కెట్ గేటుకు తాళం వేశారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు మార్కెట్‌ను మూసివేస్తున్నట్లు మార్కెట్ సీఈఓ మోడెం సురేష్ ప్రకటించారు. మండల పరిధిలోని 39 గ్రామాల రైతులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. శుక్రవారం నుంచి రైతులు యథావిధిగా మొక్కజొన్నలను ఆరబెట్టుకుని మార్కెట్‌కు తీసుకురావచ్చని తెలిపారు. అయితే పంటను తీసుకువచ్చిన రైతులు కార్యాలయంలోని రిజిస్టర్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు సహకరించి, మూడు రోజుల తర్వాతే తమ దిగుబడులను తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.



## పుల్లూరు శివాలయంలో చోరీ

- రంగంలోకి దిగిన పోలీసులు
- ఫిర్యాదుదారుడికి అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ అందజేత

పుల్లూరు, ప్రభాతగమనం : స్థానిక పుల్లూరు గ్రామ సమీపంలోని పురాతన శివాలయంలో చోటుచేసుకున్న చోరీ ఘటనపై పోలీసులు మెరుపు వేగంతో స్పందించారు. ఆలయంలో జరిగిన దొంగతనం విషయమై సమాచారం అందుకున్న వెంటనే విచారణ ప్రారంభించి, బాధితుడికి భరోసా కల్పించారు. ఈ నెల 11వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు శివాలయంలోకి చొరబడి సుమారు రూ. 8వేల విలువైన పూజా సామాగ్రి, ఇతర వస్తువులను అపహరించినట్లు సమాచారం. ఆలయ పూజారి విశ్వనాథం ఆచార్య ఈ విషయాన్ని గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సాయికుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సాధారణంగా స్టేషన్‌కు వెళ్లి పూర్తి చేయాల్సిన కేసు నమోదు ప్రక్రియను, ఎస్ఐ సాయికుమార్ అక్కడికక్కడే పూర్తి చేయడం విశేషం. పూజారి నుంచి ఫిర్యాదు స్వీకరించి, వెంటనే కేసు నమోదు చేసి, సంబంధిత ఎఫ్ఐఆర్ కాపీని అందజేశారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374